క్లుప్తంగా

సభా ప్రాంగణాన్ని పరిశీలించిన వీసీ



సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఈ నెల 8న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరవుతున్న సమావేశానికి జరుగుతున్న ఏర్పాట్లను ఏయూ వైస్ చాన్సలర్ ఆచార్య జి.శశిభూషణరావు సోమవారం ఉదయం పరిశీలించారు. ఏయూ ఇంజినీరింగ్ కాలేజీ క్రీడా మైదానంలోని సభా వేదిక, ప్రజలు కూర్చునే ప్రాంగణం తదితరాలను పరిశీలించారు. ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయం తరఫున సమావేశం నిర్వహణకు అవసరమైన సహకారం అందిస్తున్నట్లు వీసీ తెలిపారు. ప్రధాని భద్రత ఏర్పాట్లకు సంబంధించి వస్తున్న పోలీసు సిబ్బందికి, అధికారులకు ఏయూలో పలు ప్రాంతాల్లో వసతి సదుపాయం కల్పించినట్లు తెలియజేశారు.

ప్రధాని సభా ప్రాంగణానికి పశువుల బెడద



పశువులను తరలిస్తున్న సిబ్బంది

ఏయూక్యాంపస్: ప్రధానమంత్రి సభ జరిగే ప్రాంగణానికి పశువుల బెడద తప్పడం లేదు. నిత్యం పదుల సంఖ్యలో పశువులు వివిధ మార్గాలలో ఏయూలోకి ప్రవేశిస్తున్నాయి. వీటిని కట్టడి చేయడం ఏయూకు తలకుమించిన భారంగా మారింది. ఇవి వర్సిటీలో పచ్చదనాన్ని నాశనం చేస్తున్నాయి. ఈ నెల 8వ తేదీన ఏయూలో ప్రధానమంత్రి పాల్గొనే సమావేశానికి ఏర్పాట్లు భారీగా చేస్తున్నారు. అదే సమయంలో మైదానంలో పశువుల సంచారం అధికారులకు తలనొప్పిగా మారింది. వీటిని కట్టడి చేసే పనులు చేపట్టారు. సోమవారం పలు గేదెలను తరలించారు. రానున్న రెండు రోజులు ఏయూ మైదానంలో, పరిసరాల్లో పశువులు సంచరించకుండా చర్యలు తీసుకుంటున్నారు.

నివాస హక్కుల ఉద్యమ సవాళ్లపై 9న సదస్సు



సదస్సు కరపత్రాలు ప్రదర్శిస్తున్న ప్రజా సంఘాల నేతలు

సీతమ్మధార : విశాఖ నివాస హక్కుల పోరాట దినం సందర్భంగా వర్తమానంలో నివాస హక్కుల ఉద్యమ సవాళ్లు – కర్తవ్యాలు అనే అంశంపై సదస్సు 9న నిర్వహిస్తున్నామని పీవోడబ్ల్యూ నాయకురాలు లక్ష్మి తెలిపారు. ఎంఎస్ఎస్, పీవోడబ్ల్యూ నగర కమిటీలు సంయుక్తంగా రైల్వే న్యూ కాలనీ దరి సుబ్బలక్ష్మి కల్యాణ మండపంలో నిర్వహించే సదస్సుకు కర్ణాటక హైకోర్టు న్యాయవాది, కార్మిక సంఘాల నాయకుడు కామ్రేడ్ బాలన్, జె.వి.చలపతిరావు, వీవీ రమణమూర్తి, టి.శ్రీరామ్మూర్తి, ఎస్వీ రమణ, యం.వెంకటేశ్వర్లు, కేవీ రమణ, కె.రవి, కె.నిర్మల హాజరవుతారని తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆర్టీసీ కాంప్లెక్సు దరి జీవీఎంసీ గాంధీ పార్కు వద్ద సోమవారం ఆవిష్కరించారు. 2012లో చేపట్టిన పోరాటానికి గుర్తుగా జనవరి 9న విశాఖ నివాస హక్కుల పోరాట దినంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ దేశాన్ని కార్పొరేట్ల పరం చేయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. మురికివాడల్లో నివసిస్తున్న పేద ప్రజల జీవన స్థితిగతులను మార్చడానికి మాత్రం చర్యలు చేపట్టడం లేదన్నారు. ఎస్.వెంకటలక్ష్మి, రోహిణి దేవి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు



రాష్ట్ర ఆహార ప్రయోగశాల

ఆహార నాణ్యత పరీక్షలను నిర్వహించి ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందించడంలో కీలకపాత్ర పోషించాల్సిన రాష్ట్ర ఆహార ప్రయోగశాలకు నేటికీ మోక్షం కలగటం లేదు. ప్రారంభోత్సవం జరిగి ఏడాదవుతున్నా ఇప్పటికీ సిబ్బంది నియామకాలు జరగనే లేదు. దీంతో చిన్న చిన్న రాష్ట్రాలు సైతం సొంతంగా ఆహార ప్రయోగశాల కలిగి ఉంటే.. మనం మాత్రం ఇంకా ఇతర రాష్ట్రాల్లోని ప్రైవేట్ ఆహార ప్రయోగశాలలపైనే ఆధార పడాల్సి వస్తోంది.



శిథిలస్థితిలో ప్రాంతీయ ప్రయోగశాల

ప్రధాని ప్రారంభించినా..

అందుబాటులోకి రాని ఆహార ప్రయోగశాల

బీచ్‌రోడ్డు: నగరంలోని రాష్ట్ర ఆహార ప్రయోగశాలకు ఇంకా మోక్షం కలగనే లేదు. హోటల్స్, రెస్టారెంట్స్‌లో విక్రయిస్తున్న ఆహారంపై ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు చేసి, వాటి పరీక్షించే ప్రయోగశాల నేటికీ అందుబాటులోకి రాలేదు. పెదవాల్తేరులోని ప్రాంతీయ ఆహార ప్రయోగశాల వెనుక స్థలంలో నిర్మించిన ఈ ప్రయోగశాలను గతేడాది ఫిబ్రవరిలో ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. అయితే సిబ్బంది నియామక ప్రక్రియ నేటికీ ప్రారంభం కాకపోవడంతో ఆ ప్రయోగశాల నిరుపయోగంగా పడి ఉంది.

రూ.కోట్లలో ఖర్చు.. సూచీలో అట్టడుగు స్థానం

ఆహార ప్రయోగశాల అందుబాటులో లేకపోవటంతో రాష్ట్రంలోని ఆహార భద్రతాధికారులు సేకరిస్తున్న నమూనాలను పరీక్షల కోసం ఇతర రాష్ట్రాల్లోని ప్రైవేట్ ల్యాబ్‌కు పంపిస్తున్నారు. దీని కోసం ఆ ప్రైవేటు ల్యాబ్‌లకు ప్రభుత్వం రూ.కోట్లు చెల్లించాల్సి వస్తోంది. ఆహార నాణ్యత పరీక్షలు సరిగా జరగకపోవడంతో ఎఫ్ఎస్ఎస్ఏఐ (ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా) విడుదల చేసిన ఆహార భద్రత సూచీలో గత పదేళ్లుగా ఏపీ అట్టడుగు స్థానంలోనే ఉంటోంది.

నేటికి కానరాని ఉద్యోగుల భర్తీ ప్రక్రియ



నిరుపయోగంగా పడి ఉన్న ఆహార ప్రయోగ పరికరాలు

రిపోర్టులకు 20 రోజులు

రాష్ట్రంలో ఆహార ప్రయోగశాల లేకపోవటంతో ఫుడ్ సేఫ్టీ అధికారులు సేకరించిన ఆహార నమూనాలను హైదరాబాద్ వంటి నగరాలకు పంపిస్తున్నారు. ఆ రిపోర్టులు రావటానికి 20 రోజుల సమయం పడుతోంది. అదే ఇక్కడే ప్రయోగశాల ఉంటే రిపోర్టులు వేగంగా రావటంతో పాటు ప్రైవేటు ల్యాబ్‌లకు చెల్లిస్తున్న కోట్ల రూపాయలు ఆదా అవుతాయి.

నిరుపయోగంగా పరికరాలు

రూ.కోట్ల వ్యయం చేసి కొనుగోలు చేసిన పరికరాలు నిరుపయోగంగా ఉండి, పాడైపోతున్నాయి. ఆహార ప్రయోగశాల అందుబాటులోకి రావాలంటే సుమారు 50 మంది వరకు సిబ్బంది అవసరం.

పాడైపోతున్న నూతన పరికరాలు



నీటి పరీక్షలకే పరిమితమైన ప్రాంతీయల్యాబ్

ఇక్కడ కనీసం వాచ్‌మెన్‌ని కూడా నియమించలేదు. దీంతో ల్యాబ్‌లోని రూ.కోట్ల విలువైన పరికరాల రక్షణ విషయంలోనూ సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.

నీటి పరీక్షలకే పరిమితం

రాష్ట్ర ఆహార ప్రయోగశాల పూర్తయిపోతుందన్న ధీమాతో అధికారులు ప్రాంతీయ ఆహార ప్రయోగశాలపై దృష్టి సారించలేదు. ఇప్పటికే ఆ ప్రయోగశాల భవనం శిథిలస్థితిలోకి చేరుకుంది. ఆహార పరీక్షలకు సంబంధించిన పరికరాలు, రసాయనాలు కూడా లేకపోవడంతో ఇక్కడ పని చేస్తున్న పదిమంది సిబ్బందికీ పని అంతంతమాత్రంగానే ఉంటోంది.

ప్రైవేటు పరీక్షల నిర్వహణ ద్వారా రూ.కోట్ల భారం

వైఎస్సార్‌సీపీ హయాంలోనే పూర్తయినా..

ప్రాంతీయ ఆహార ప్రయోగశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన భవనాన్ని నిర్మించాలని 2007లో అప్పటి ప్రభుత్వం పనులను ప్రారంభించింది. పనులు నెమ్మదిగా సాగుతూ వచ్చాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రానికి ఆహార ప్రయోగశాల అవసరాన్ని గుర్తించి దానిని రాష్ట్ర ప్రయోగశాలగా మార్చింది. భవన నిర్మాణం కూడా వేగం పుంజుకుంది. ఆహార ప్రయోగశాలకు అవసరమైన పరికరాలను కూడా సమకూర్చింది. ప్రధాని మోదీతో వర్చువల్ ప్రారంభోత్సవమూ పూర్తయింది. అయితే ఈ ప్రయోగశాలకు అవసరమైన సిబ్బంది నియామకం జరిగే సమయానికి ఎన్నికల కోడ్ రావడంతో అడ్డంకి ఏర్పడింది. అప్పటి నుంచి ఇప్పటికీ ఆ ప్రక్రియ పూర్తి కానేలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 6 నెలలు అవుతున్నా కనీసం పట్టించుకోలేదు.

వ్యర్థాలు తొలగించారు



శుభ్రం చేసిన తరువాత పరిశుభ్రంగా పరిసరాలు

సాక్షి ఎఫెక్ట్..

ఏయూక్యాంపస్: స్థానిక పెదవాల్తేరు నుంచి లాసన్స్ బే కాలనీకి వెళ్లే మార్గంలో పేరుకుపోయిన చెత్తను జీవీఎంసీ సిబ్బంది తొలగించారు. ఇక్కడ రోడ్డు పక్కనే డస్ట్‌బిన్ నిండిపోవడంతో పక్కనే కూడా చెత్త పరుచుకుని, పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. దుర్గంధంతో స్థానికులు పడుతున్న ఇబ్బందులపై 'పేరుకుపోతున్న వ్యర్థాలు' శీర్షికన సాక్షిలో సోమవారం వార్త ప్రచురితమైంది. దీనిపై వెంటనే పారిశుద్ధ్యం విభాగం అధికారులు స్పందించారు. ఉదయం సిబ్బందితో అక్కడికి వెళ్లి డస్ట్‌బిన్‌లో ఉన్న చెత్తను, చుట్టూ ఉన్న వ్యర్థాలను కూడా తొలగించారు. దీంతో పరిసరాలు పరిశుభ్రంగా మారాయి. సాక్షికి, జీవీఎంసీ సిబ్బందికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రిలో అరుదైన చికిత్స

కంటి క్యాన్సర్‌కు ప్లాక్ బ్రాకీథెరపీ

ఆరిలోవ: ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో అరుదైన ప్లాక్ బ్రాకీథెరపీని విజయవంతంగా నిర్వహించినట్లు కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ అనసూయ సోమవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ 48 సంవత్సరాల ఒక వ్యక్తికి ప్లాక్ బ్రాకీథెరపీ ద్వారా కంటి క్యాన్సర్ శస్త్ర చికిత్స చేశామన్నారు. ఇది అత్యాధునిక ప్రక్రియ అని తెలిపారు. కరొయిడల్ మెలనోయా, కరొయిడల్ హెమన్జియోమా, రెటినల్ వాస్క్యులర్ ట్యూమర్లు, ఇతర కంటి ఉపరితల ట్యూమర్లకు ఈ విధానాన్ని ఉపయోగిస్తారని వివరించారు.

బాలల హక్కులకు భరోసాగా నిలవండి

మాజీ స్పీకర్ తమ్మినేని



చైల్డ్ రైట్స్ అవేర్‌నెస్ ఫోరం లోగో ఆవిష్కరిస్తున్న మాజీ స్పీకర్ తమ్మినేని

మద్దిలపాలెం: బాలల హక్కులకు భరోసాగా నిలవాలని శాసనసభ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం సూచించారు. బాలల హక్కుల పరిరక్షణకు విశాఖ కేంద్రంగా ఏర్పడిన చైల్డ్ రైట్ అవేర్‌నెస్ ఫోరం లోగోను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలలపై రాష్ట్రంలో నిత్యం వెలుగులోకి వస్తున్న దాడులు, దండనలు, ఉల్లంఘనల నేపథ్యంలో బాలల సంక్షేమానికి పోరాడేందుకు కొత్త సంస్థలు ఏర్పాటవడం హర్షణీయమన్నారు. ఈ సంస్థల్లో వ్యక్తులు బాలల తరఫున శక్తుల్లా వ్యవహరించి, పిల్లలకు దిక్సూచిగా నిలవాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం, చైల్డ్ రైట్స్ అవేర్‌నెస్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షురాలు జి.ధనలక్ష్మి, యువజన నాయకుడు తమ్మినేని చిరంజీవి నాగ్, కిల్లి సత్యనారాయణ, రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ మెట్ట మల్లేశ్వరరావు, బాలల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

8న పెదవాల్తేరు రైతు బజార్‌కు సెలవు

మహారాణిపేట: ఈ నెల 8న ప్రధాని నరేంద్ర మోదీ విశాఖ పర్యటన సందర్భంగా పెదవాల్తేరు రైతు బజార్‌కు ఆ రోజు సెలవు ప్రకటించినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏయూ ఇంజినీరింగ్ కాలేజీ మైదానంలో బహిరంగ సభ జరుగుతుండడం వల్ల ప్రజలు, వినియోగదారులు ఇబ్బంది పడకుండా ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు.

విద్యార్థినులకు స్వీయ రక్షణపై అవగాహన



విద్యార్థులకు బహుమతి అందజేస్తున్న జేసీఐ విశాఖ నైట్స్ ప్రతినిధులు

ఆరిలోవ: తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు జేసీఐ విశాఖ నైట్స్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం స్వీయ రక్షణపై అవగాహన కల్పించారు. పాఠశాలలో సుమారు 200 మంది విద్యార్థినులకు అత్యవసర పరిస్థితుల్లో ఆత్మరక్షణ కోసం తగిన మెలకువలు నేర్పారు. కరాటే, కుంగ్‌ఫూ తదితర వాటి అవసరం గురించి తెలియజేశారు. తమను తాము ఏవిధంగా రక్షించుకోవాలో వివరించారు. మంచి, చెడు స్నేహాల గురించి తెలిపారు.

ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు కిరణ్, సంతోషి నెమ్మాని, ఆదిత్య మాట్లాడుతూ బాలికలకు చదువుతో పాటు క్రీడలు, స్వీయ రక్షణ తెలియాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు సంస్థ ప్రతినిధులు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలి

ఏయూక్యాంపస్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 8వ తేదీన విశాఖ నగరానికి వస్తున్న సందర్భంగా ఉత్తరాంధ్ర ప్రాంతానికి ప్రత్యేక డిక్లరేషన్‌పై స్పష్టమైన ప్రకటన చేయాలని ఉత్తరాంధ్ర పరిరక్షణ సమితి అధ్యక్షుడు లగుడు గోవిందరావు డిమాండ్ చేశారు. ప్రత్యేక రైల్వే జోన్ కోసం అనేక పోరాటాలు చేశామన్నారు. రాష్ట్ర విభజన జరిగి దశాబ్దం అవుతున్నా, ప్రధాని భూమిపూజ చేయడానికి రావడం శుభ పరిణామమని అన్నారు. బీచ్‌రోడ్డులోని ఓ హోటల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి నిధులను కేటాయిస్తూ, ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించాలన్నారు. ఉత్తరాంధ్రను అమరావతికి దీటుగా అభివృద్ధి చేయాలని, పరిశ్రమల్లో స్థానికులకు 70 శాతం ఉద్యోగాలు ఇవ్వాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయం వెనక్కి తీసుకుని సెయిల్‌లో విలీనం చేయా లని కోరారు. ఉత్తరాంధ్ర లోని పెండింగ్ ప్రాజెక్టులు సత్వరం పూర్తిచేయాలన్నారు. ఉత్తరాంధ్రను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయని పక్షంలో ఉత్తరాంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర పరిరక్షణ సమితి నాయకులు పెదిరెడ్ల సత్యం, వరుదు రాజ్ కుమార్, పి.శ్రీనివాస రావు, బర్ల పైడం నాయుడు, పట్నాయక్, సూర్యారావు, రవికుమార్ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ అమ్మడం లేదని ప్రకటించాలి



మాట్లాడుతున్న ఆర్‌కేఎస్‌వీ కుమార్

డాబాగార్డెన్స్ : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విశాఖ పర్యటన సందర్భంగా విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మడం లేదని ప్రకటించాలని సిటూ విశాఖ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. విశాఖ స్టీల్‌ప్లాంట్ నూటికి నూరు శాతం ప్రైవేటీకరణ చేస్తామని ప్రకటించిన నాటి నుంచి నేటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా కార్మిక వర్గం విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు అని పెద్ద ఎత్తున పోరాడుతోందని సిటూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం జగదాంబ జంక్షన్ సమీపాన గల కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విషయమై అనేక సందర్భాల్లో మంత్రుల దృష్టికి, ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. 32 మంది ప్రాణత్యాగాలతో ఏర్పడిన స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తామంటే ఆంధ్ర రాష్ట్ర ప్రజలు ఒప్పుకోరన్నారు. ప్రైవేటీకరణ చేయడం లేదని మోదీ విశాఖ పర్యటన సందర్భంగా ప్రకటించాలని కోరారు. దేశంలో ఉన్న అన్ని స్టీల్‌ప్లాంట్లకు సొంత గనులున్నాయని, విశాఖ కర్మాగారానికి మాత్రం సొంత గనులు కేటాయించకుండా నష్టాల ఊబిలోకి నెట్టేసే కుట్రను ప్రభుత్వం కావాలనే అమలు చేస్తోందని ఆరోపించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ చార్జీలపై నేటి నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

- మధురవాడలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవకాశం

మధురవాడ: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు విద్యుత్ చార్జీల (టారిఫ్)పై ఆన్‌లైన్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నట్టు ఈఈ శ్రీనివాసరావు తెలిపారు. మధురవాడలోని విశాఖ జోన్-3 కార్యాలయం వద్ద ఈ నెల 7, 8, 10 తేదీలలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు వీడియా కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయాలు సేకరిస్తామని చెప్పారు. ఇందులో ఏపీఈఆర్సీ ఇన్‌చార్జి చైర్మన్ ఠాకూర్ రాంసింగ్, ఫైనాన్స్ మెంబర్ పీవీఆర్ రెడ్డి తదితరులు పాల్గొంటారని తెలిపారు.ఆన్‌లైన్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొనదలచే వారు ముందుగా మధురవాడ సబ్‌స్టేషన్ సమీపంలోని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని తెలియజేశారు. పేర్లు నమోదు చేసుకోని వారికి నియంత్రణ మండలి అనుమతితో అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని జోన్-3 పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీనివాసరావు కోరారు.

పబ్లిక్ పార్కు ప్రారంభమెప్పుడో?



పార్కు లోపల వాకింగ్ ట్రాక్, పిల్లల ఆట పరికరాలు



జోడుగుళ్లపాలెం బీచ్ రోడ్డులో పబ్లిక్ పార్కు

ఆరిలోవ: తొమ్మిదో వార్డు జోడుగుళ్లపాలెంలో నిర్మించిన జీవీఎంసీ పార్కు ప్రారంభానికి నోచుకోవడం లేదు. నిర్మాణం పూర్తయినా వినియోగంలోకి తీసుకురాకుండా వదిలేశారు. ఈ పార్కును జీవీఎంసీ రూ.60 లక్షలతో నిర్మించింది. ఇందులో పిల్లలు ఆడుకోవడానికి పలు రకాల ఆట పరికరాలు, నడక దారులు, పెద్దలు సేదదీరడానికి షెల్టర్ నిర్మించారు. ఈ పనులు గతేడాది జనవరిలో ప్రారంభమయ్యాయి. సుమారు నెల రోజులు పాటు చకచకా జరిగిన దీని పనులు, సాధారణ ఎన్నికల హడావుడితో కొన్నాళ్లు ఆగిపోయాయి. అనంతరం పునఃప్రారంభమైనా మందకొడిగా జరిగాయి. ఎట్టకేలకు గత నెలలో నిర్మాణ పనులు పూర్తయ్యాయి. పార్కును వినియోగంలోకి వస్తే పిల్లలకు ఆటవిడుపుగా ఉంటుందని భావిస్తున్నారు. వెంటనే పార్కును ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

అష్టదళ పద్మారాధన నేడు

డాబాగార్డెన్స్ : విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనక మహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891 2711725, 2566514లో సంప్రదించాలి.

గాంధేయ మార్గ పోరాటంతో రైల్వే జోన్

- ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ మాజీ ప్రధాన కార్యదర్శి చలసాని గాంధీ
- నాలుగు దశాబ్దాల కల సాకారమవుతున్న వేళ..
- రేపు ప్రధాని మోదీ చేతుల మీదుగా శంకుస్థాపన



మాట్లాడుతున్న చలసాని గాంధీ

డాబాగార్డెన్స్ : గాంధేయ మార్గ పోరాటమే రైల్వే జోన్ సాధించి పెట్టిందని, నాలుగు దశాబ్దాల పోరాటానికి ఈ నెల 8న ప్రధాని నరేంద్ర మోదీ ఉత్తరాంధ్ర జిల్లాల వాసుల కల నెరవేర్చనున్నారని అఖిల భారత రైల్వే ఉద్యోగుల సమాఖ్య మాజీ ఉపాధ్యక్షుడు, ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ మాజీ ప్రధాన కార్యదర్శి చలసాని గాంధీ తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం మీడియాతో మాట్లాడారు. రైల్వే జోన్ కోసం గౌతు లచ్చన్న, బాట్టం శ్రీరామమూర్తి, ద్రోణంరాజు సత్యనారాయణ, కింజరాపు ఎర్రన్నాయుడు, కమ్యూనిస్టు నాయకులు సీహెచ్ నరసింగరావు, జేవీ సత్యనారాయణమూర్తి..ఇలా ఎందరో ప్రజాప్రతినిధులు, కార్మిక నాయకులు 40 ఏళ్లగా ఉద్యమాన్ని సజీవంగా ఉంచారన్నారు. ఎన్నికల ప్రణాళికలో ప్రధాన అంశంగా ఉండడమే గాక వాల్తేర్ డివిజన్‌తో కూడిన దక్షిణ కోస్తా రైల్వే జోన్ తక్షణం ప్రారంభించాలని విశాఖ ఎంపీ కృషి చేశారన్నారు. ఉత్తరాంధ్రలోని వాల్తేర్ డివిజన్‌పై ఎప్పుడూ వివక్షేనని, కొత్త ప్రాజెక్టుల మంజూరు నుంచి కొత్త రైలు మార్గాలు, ఉద్యోగ నియామకాలు..ఇలా అన్నింటిలోనూ ఆగ్నేయ రైల్వే, ఈస్ట్ కోస్ట్ రైల్వే ఆధ్వర్యంలో బాగా అన్యాయానికి గురయ్యామన్నారు. రాష్ట్ర విభజన చట్టంలో రైల్వే జోన్ ప్రస్తావన ఉన్నా, వివిధ కారణాలతో ఇప్పటి వరకు ఆంధ్రుల కల నెరవేరలేదన్నారు. జోన్ ప్రారంభోత్సవం అవ్వగానే కార్యకలాపాలు ప్రారంభించడానికి అవసరమైన భవనాలు ఇప్పటికే విశాఖలో సిద్ధంగా ఉన్నాయన్నారు. రైల్వే జోన్ ఏర్పాటైతే కొత్త ప్రాజెక్టులు, ప్రొడక్షన్ యూనిట్లు, వర్క్‌షాప్‌లు మంజూరవుతాయన్నారు. కొత్త రైలు మార్గాలు, కొత్త రైళ్లు, స్టేషన్లు, అదనపు బెర్త్‌లు వస్తాయని, విశాఖ నుంచి న్యూఢిల్లీకి రాజధాని ఎక్స్‌ప్రెస్ వస్తుందన్నారు.

గృహ హింస బాధితురాలికి ఆశ్రయం

సీతమ్మధార : గృహహింస కారణంగా రోడ్డున పడిన ఒక గృహిణికి జీవీఎంసీ నిరాశ్రయుల వసతి గృహంలో సోమవారం ఆశ్రయం కల్పించారు. ఏయూటీడీ సంస్థ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లాకు చెందిన బొత్స రోహిణి (38) తండ్రి రెండో పెళ్లి చేసుకోవడంతో సవతి తల్లి వేధింపులు భరించలేక ఇళ్లు వదిలి వైజాగ్ వచ్చేసింది. రోడ్డు మీద కూడా ఆకతాయిల వేధింపులు భరించలేక డాబాగార్డెన్స్‌లో గల ప్రేమసమాజానికి వెళ్లింది. వారు నేరుగా ద్వారకానగర్‌లోని టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ – జీవీఎంసీ మహిళా నిరాశ్రయుల వసతి గృహానికి తరలించారు. తనకి షెల్టర్ ఇవ్వడంతోపాటు, చుట్టూ ఉన్న వ్యాపార సముదాయాల్లో ఉపాధి చూసుకుని హాస్టల్ చూసుకోమని సిబ్బంది చెప్పారు. వసతిగృహం మేనేజర్ జ్యోతిర్మయి ఆధ్వర్యంలో షెల్టర్ సిబ్బంది, కేర్ టేకర్ లీలా ఆమెకి ఆశ్రయం కల్పించారు.

అతివ అయితేనేమి..!



జీవితం అందరికీ వడ్డించిన విస్తరి కాదు.. ఆ గమనంలో ఒడిదుడుకులెన్నో.. వాటిని అధిగమించి, కుటుంబ పోషణ కోసం పురుషులతో సమానంగా కష్టించే మహిళలు నిత్యం తారసపడుతూనే ఉంటారు. అలా బీచ్‌రోడ్డులో ఓ మహిళ తోపుడుబండిపై పీచుమిఠాయిని విక్రయిస్తూ కనిపించారు. సాధారణంగా పురుషులు ఇటువంటి వ్యాపారాలు చేస్తుంటారు. కానీ తన జీవన ప్రయాణాన్ని గౌరవంగా నడుపుకోవడానికి తోపుడు బండిపై విక్రయిస్తున్న ఈ మహిళకు హాట్సాఫ్ చెప్పాల్సిందే.. - ఏయూక్యాంపస్